IOSR Journal Of Humanities And Social Science (IOSR-JHSS)
Volume 23, Issue 11, Ver. 1 (Nov. 2018) PP 100-102
e-ISSN: 2279-0837, p-ISSN: 2279-0845. www.iosrjournals.org

# జాషువా మానవతా వాదం

## JAASHUVAA MAANAVATHAA VAADAM

బి. మేరి కుమారి B.MARY KUMARI
జె.యం.జె మహిళా కళాశాల (స్వయంప్రతిపత్తి), తెనాలి. J.M.J Women's College(Autonomous), Tenali.

"కుల మతాలు గీసుకొన్న గీతల జొచ్చి
పంజరాన గట్టువడను నేను
నిఖిలలోక మెట్లు నిర్ణయించిన నాకు
తరుగలేదు విశ్వనరుడనేను"

అని ధైర్యంగా చెప్పిన జాషువా భావకవిత్వం ఉధృతంగా ఉన్న రోజులలో తనదైన భావ వ్యక్తీకరణకు పద్యాన్ని సాధనంగా తీసుకుని ఛంద సామ్రాజ్యాన్ని పాలించిన నవయుగ కవిచక్రవర్తి జాషువా. ఆయన జీవితాన్ని, కవిత్వాన్ని విడదీసి చూడలేము. అనుభూతి ఆవేదనల వ్యక్తీకరణమే జాషువా కవిత్వం.

ప్రకృతిలోని అతి సామాన్యమైన వస్తువుల్ని కవితా వస్తువులుగా స్వీకరించి రచన చేసిన ఘనత జాషువాకే దక్కుతుంది. గిజిగాడు, సాలీడు, గొల్లభామ, తేనెటీగ మొదలైన అల్ప ప్రాణుల్ని సైతం ప్రతిభావంతంగా వర్ణించిన ఉదాత్త భావుక సంపన్నుడు జాషువా.

**శిశువు :-** ఆంధ్ర సాహిత్యంలో కవులు 'శిశువు' తీరును వర్ణించిన సందర్భాలు చాలా తక్కువగా ఉన్నాయి. శిశువు బాల్య చేష్టలను కవితా వస్తువుగా స్వీకరించారు, కాని శిశువు తీరును వర్ణించిన ప్రశస్తి జాషువాకే దక్కుతుంది. ఆయన ఊహ, లోకవృత్త పరిశీలన, ఆలోచన సరళి అభివ్యక్తమౌతాయి.

శిశువు బొటనవ్రేలు నోటిలో పెట్టుకొని ముల్లోకాల తీరు తెన్నుల్ని గమనిస్తూ యోగభ్యాసం చేస్తూ లోపల ఆనందం అనుభవిస్తున్నాడని చెప్పడం సమంజసంగా ఉంది. తల్లిదండ్రుల శరీరాలనే తీగలకు తొమ్మిది నెలల పండుగా శిశువు జన్మించాడని చెప్పటం క్రొత్తదనంగా వుంది.

శిశువుకు అమృతం, విషం అనే తేడా తెలియదు. దేనినైనా ఆస్వాదించటానికి సిద్ధపడతాడు. అతడు వెఱ్ఱిబాగులవాడని చేతికి దొరికిన ప్రతి వస్తువును తినటానికి ఊబలాట పడతాడని చెప్తాడు. శిశువుకు మాటలు రావు, కేవలం పాలే త్రాగుతాడు, బాగా నిద్రపోతాడు. ఏ దేశమో తెలియదు. మొన్న మొన్ననే ఈ భూమి మీదకు వచ్చాడని అంటాడు. శిశువు యొక్క ప్రతి కదలికను గ్రహించి ఆకళింపు చేసుకున్న రచయితగా దర్శనమిస్తాడు.

నిద్రపోయే సమయంలో శిశువు అమ్మకౌగిలి అనే పంజరంలో& చిలుక లాంటి వాడని, చిలక పంజరంలో ఉన్నట్లే శిశువు కూడా తల్లి కౌగిలి అనే పంజరంలో ఉంటాడు అంటాడు. అతని లేత కండలు, పస్తాదుల కండలలా మెలి తిరిగిఉబ్బి ఉంటాయని అందువల్ల అతడు చిన్ని పస్తాదు అంటాడు. మాటలు నేర్చిన తర్వాత ఈ భూమి మీదకు ఎందుకు వచ్చాడో అడగాలి అంటాడు. ప్రస్తుతానికి అతనికి ఏ పాపము తెలియదు అని అతని అమాయకత్వాన్ని తెలియజేస్తున్నాడు.

కేవలం జానెడు నిడివి, చీకట్లు కమ్ముకొని కడుపులోనిద్రించి లేచిన నిర్గుణుడు. నున్నని చెక్కిళ్ళతో బోసినోటి నవ్వులతో ముద్దులు మూటకట్టే అందగాడు అంటాడు. తల్లిపాలు అనే తేనె ధారల్ని అన్నంగా తెచ్చుకొన్న అతిధి అంటాడు. అతిధి అన్నం తెచ్చుకోడు, కాని ఈ అతిధి అన్నం తెచ్చుకున్నాడని చమత్కరించటం గమనించవచ్చు. బట్టలు కట్టుకోడు అయినా సిగ్గుపడడు. ప్రకృతి అనే స్త్రీ ఆకలి, నిద్ర నేర్పింది అంటాడు. భూమి అనే పాఠశాల వర్ణన అదబ్బుతంగా ఉంది.

తల్లితో అతనికున్న సంబంధం ఎంత గాఢమైందో కాని, ఏడ్చి మరి సేవలు చేయించుకుంటాడు. భగవంతుడు ఏమి సరసాలు ఆడతాడో కాని పెద్దగా చప్పట్లు కొట్టుకొంటాడు. తల్లి "నా బంగారుకొండ, నా రత్నమా" అని పిలుస్తుంది. పెరిగి పెద్దయి చదువు సంధ్యలు నేర్చుకొని తల్లి పలుకుల్ని నిలుపుతాడో లేదో అని కవి తన అనుమానమును వ్యక్తం చేస్తున్నాడు. ఇప్పటి యువత తల్లిదండ్రుల పట్ల చూపిస్తున్న నిరాదరణ కవి ఆనాడే తన కవిత్వంలో తెలియజేశాడు. చేతిలోని గిలక్కాయతో ఆడుకొంటూ అది పలకటం లేదని కోపపడతాడు, పొరుగావిడ తన దగ్గరకురాగా ఆమె ఇతర అనే భావాన్ని ప్రకటిస్తాడు. పెద్ద పెద్ద శబ్ధాలకు వణికిపోయి తల్లి కౌగిలిలో దాక్కుంటాడు. చిన్నప్పుడు తల్లిని వదలకుండా ఉండి, పెద్దయ్యాక ఆ తల్లిని మరిచి పోవటం ఏమి న్యాయం, ఈ అంశాన్ని నేటి యువతరం గుర్తించాలి.

**గబ్బిలం :-** జాషువా కలం నుంచి జాలువారిన కావ్యాలలో గబ్బిలము ముఖ్యమైనది. ఇది కల్పిత కావ్యం అరుంధతీ సుతుని అశ్రు సందేశంతో కూడిన కావ్యం. కుల వివక్ష వల్ల, అస్పృశ్యతవల్ల, పేదరికం వల్ల, మత మౌఢ్యం వల్ల జాషువ పడిన బాధలు, ఆవేదనలు అవమానాలకు అక్షరరూపమే ఈ కావ్యం.

ఈ లోకంలో పంచముడుగా పుట్టిన మనిషి సమాజం నుంచి వెలివేయబడ్డాడు. ఇతనిని ఉన్నత వర్గాలవారు దగ్గరకు రానీయరు. శూద్రులు కూడా వీళ్ళను అసహ్యించుకుంటారు. పంచముడు ఏ వర్గానికి చెందక ఉభయ భ్రష్టత్వం పొందుతాడు. గబ్బిలం కూడా పక్షిజాతికి, జంతుజాతికి చెందక, మృగపక్షి ధర్మాలతో ఉండి అరుందతీ సుతుని సందేశాన్ని అందించటానికి సాధన మౌతుంది. గబ్బిలం ప్రవేశించిన గృహం నివాసయోగ్యం ఎలా కాదో అలాగు అరుంధతి సుతుడు కూడా సమాజానికి అంటరానివానిగా కవి వర్ణించాడు.

భరతమాత కడగొట్టు బిడ్డగా ఇతడు జన్మించాడు. ఇతడు తనకు లభించిన ధనంతోనే సంతృప్తి పడతాడు. ఏరకంగా తనను హింసించినా చెప్పులు కుట్టడం అనే తన వృత్తిని కొనసాగిస్తాడు. ఇతని సేవకు లోకం ఋణపడి ఉంది. తనకు తిండి లేకపోయినా లోకానికి తిండి పెట్టే శ్రామిక మూర్తి అరుంధతి సుతుడు. ఇతని తలమీద వున్న బురదను కడగటానికి గంగాజలం కూడా కడగలేకుండా పోయింది. ఇతడు దేవునికి నైవేద్యం పెడితే త్రిమూర్తులకు కూడా నైవేద్యం ఉండదు. పాముకు పాలు, చీమకు పంచదార పెట్టి సంతృప్తిపడే లోకం మనది. అంటరానివాడు వున్నచోట ధర్మదేవత కూడా నిలబడదు. దీనిని బట్టి అంటరానివానికి న్యాయం దక్కదని భావం.

అంటరానివానిని ఉద్ధరించడానికి భగవంతుడే పూనుకోలేదు. ఇక మనిషి అతన్ని ఎలా ఉద్ధరిస్తాడు. పుట్టు బానిస అయిన తనకు పెండ్లి ఎందుకు అని పెండ్లే మానుకున్నాడు. తన ఇంట్లో ప్రవేశించి దయ్యపు పిల్లలా తిరుగుతున్న గబ్బిలంతో తన వృత్తాంతాన్ని తెలియజేస్తాడు. నీవు దేవాలయాలలో తిరుగుతూ మాలాంటి వ్యక్తులకు లేని గౌరవాన్ని పొందుతున్నావు అని అంటాడు. ఈ ప్రశ్న అరుంధతి సుతునిచే కవి పల్కించటం సామాజిక స్థితిని తెలియజేస్తుంది. భూ ప్రపంచం గాఢనిద్రలో ఉన్న సమయంలో నా ఇంటిలో దేనికోసం వెతుకుతున్నావు నీవు. ఇక్కడ నీకు ఆనందం లేశమైనా లభించదు. హృదయంలేని లోకం ఇది. ఇక్కడ ధర్మధేనువులు పిదికే పాలు పేదలకు లభించవు. ధనవంతుడు ఆజ్ఞాపిస్తే బ్రహ్మాది దేవతలు కూడా నోరు విప్పరని చెప్పటం ద్వారా ధనవంతులకు ఉన్న ప్రాముఖ్యాన్ని గుర్తించవచ్చు.

ఈ లోకంలో విగ్రహాల వివాహాలు చేయడానికి వందలు వేలు ఖర్చు పెడతారే గాని పేదలైన బిక్షకుల పాత్రల్లో మెతుకును కూడా విదిల్చరు. ముప్పై మూడు కోట్ల దేవతలు ఈ దేశం మీద ఎగబడ్డారని దరిద్రుల ఆకలి ఎప్పటికి తీరని సమస్యగా ఉండిపోతుందన్నాడు. దేవతార్చన కంటే మానవత్వం ముఖ్యమని తెలియజేశాడు.

తల్లిదండ్రుల ప్రేమను మరచిపోయి వారిని వృద్ధాశ్రమాలలో ఉంచుతూ మానవత్వం మరచిపోయిందని కవి నేటి యువతరం గురించి ఆవేదన వ్యక్తం చేశాడు. అలాగే ఈనాటి సమాజం మానవత్వం మరచి బీదవానిని ఆకలి రాకాసి నుండి కాపాడలేకపోతున్నారని తెలియజేశాడు.